క్లుప్తంగా

నేడు, రేపు గడప గడపకు మన ప్రభుత్వం

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండలంలో సోమ, మంగళవారాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నగేష్‌కుమారి ఆదివారం తెలిపారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు పార్లపల్లి, చెర్లోపల్లి, కల్యాణపురం, మంగళవారం సాయంత్రం 4 గంటలకు బిరదవోలు, ముత్యాలపేట, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని వివరించారు.

కొత్తూరులో ఎమ్మెల్యే ప్రసన్న..

ఇందుకూరుపేట: మండలంలోని కొత్తూరులో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ ఆదివారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

హెచ్‌ఎం తాటిపర్తికి సన్మానం



కొడవలూరు: తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల్లో వెంకన్నపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం తాటిపర్తి వెంకటేశ్వర్లును ఆదివారం ఘనంగా సన్మానించారు. బ్రహ్మోత్సవాల్లో కవితా గానం, తెలుగు సంస్కృతి, తెలుగు భాషాభివృద్ధిపై ప్రసంగించినందుకు గానూ ఆయనకు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందజేసి శాలువాతో సత్కరించారు. ప్రపంచ తెలుగు సాహిత్య, సాంస్కృతిక అకాడమీ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, కార్యక్రమ నిర్వాహకురాలు కొల్లి రమావతి, తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

పొదలకూరు : మండలంలోని యర్రబల్లి గ్రామంలో ఆదివారం ఇరువర్గాల మధ్యన ఘర్షణ నెలకొంది. ఇరువర్గాల వారు పరస్పరం దాడులు చేసుకోవడడంతో పలువురు గాయపడ్డారు. పొలానికి సాగునీరు పెట్టే విషయంలో తన కుమారుడు శీనయ్యపై హనుమంతు, హజరత్తమ్మ కర్రతో దాడి చేసి గాయపరిచినట్టు వెంకటస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే అంజయ్య సాగునీటి విషయంలో తన కుమారుడు హనుమంతుపై వెంకటస్వామి, శీనయ్య, వెంకటరమణమ్మ ఇనుపరాడ్‌తో దాడిచేసి గాయపరిచారని ఫిర్యాదు చేశారు. ఎస్సై ఎస్‌కే కరిముల్లా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విశాలాక్షి వృద్ధాశ్రమానికి చేయూత



వెంకటాచలం: మండలంలోని గొలగమూడిలోని విశాలాక్షి వృద్ధాశ్రమానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం గ్రైండర్, ఫ్యాన్లు, బియ్యం, మందులు వితరణ చేశారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు నరసింహారెడ్డి, అమరావతి కృష్ణారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ఆశ్రమ నిర్వాహకుడు కోసూరు రత్నంగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పొన్నవాహనంపై వేణుగోపాలుడు



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు పొన్నవాహనంపై ఆదివారం దర్శనమిచ్చారు. ఉదయం ముసుగులసేవ ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఉభయకర్తలుగా వాసుదేవ్, వెంకటస్వామి, నరసింహరావు, శ్రీనివాసులు, రామారావు దంపతులు వ్యవహరించారు. ఈఓ చంద్రశేఖర్‌రావు, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ చంద్రమౌళీ రెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.

సాకారం కానున్న సొంతింటి కల

- జగనన్న కాలనీల్లో చకచకా గృహ నిర్మాణాలు
- అధికారుల నిరంతర పర్యవేక్షణతో నిర్మాణాల్లో పురోగతి
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



నాగమాంబపురంలో వేగంగా నిర్మిస్తున్న ఇళ్లు

బుచ్చిరెడ్డిపాళెం: పేదల సొంతింటి కల సాకారం కాబోతుంది. నగర పంచాయతీతో పాటు మండలంలోని జగనన్న కాలనీ లేఅవుట్లలో గృహ నిర్మాణాలు ఊపందుకున్నాయి. అధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ చకచకా సదుపాయాలు కల్పిస్తుండడంతో నిర్మాణాల్లో పురోగతి కనిపిస్తోంది.

3210 గృహాలు మంజూరు

నవరత్నాల్లో భాగంగా పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న కాలనీ లేఅవుట్లను ఏర్పాటు చేశారు. అర్హులైన పేదలకు ఉచితంగా ఇళ్ల పట్టాలను ఇవ్వడంతో పాటు గృహ నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేస్తున్నారు. అందులో భాగంగా పట్టణంలో 2181, మండలంలో 1029 గృహాలు మంజూరు చేశారు.

లబ్ధిదారుల అభిప్రాయం మేరకు..

గృహ నిర్మాణాల విషయంలో లబ్ధిదారులు అభిప్రాయం మేరకు అధికారులు అడుగులేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేస్తుండగా, పూర్తిగా లబ్ధిదారులే నిర్మించుకునేందుకు మొదటి ప్రాధాన్యతను ఇస్తోంది. ద్వితీయ ప్రాధాన్యతగా ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను ప్రభుత్వం సరఫరా చేయగా, లబ్ధిదారులు నిర్మించుకోవాల్సి ఉంటుంది. తృతీయ ప్రాధాన్యతగా కాంట్రాక్టర్ ద్వారా గృహ నిర్మాణాన్ని పూర్తిచేసే అవకాశం కల్పించింది. కాంట్రాక్టర్లు సైతం గృహాలను పూర్తి నాణ్యతతో ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మించే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

శరవేగంగా నిర్మాణాలు

బుచ్చిరెడ్డిపాళెంలోని జగనన్న కాలనీ లేఅవుట్లతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లోని లేఅవుట్లలో గృహ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. అధికారులు నిత్యం లేఅవుట్లను సందర్శిస్తూ గృహ నిర్మాణాల్లో పురోగతిని పర్యవేక్షిస్తున్నారు. లబ్ధిదారులకు అవసరమైన సదుపాయాలను ఎప్పటికప్పుడు కల్పిస్తూ పనులను వేగవంతం చేస్తున్నారు. దీంతో ఇప్పటికే అర్బన్‌లో 171, రూరల్‌లో 290 ఇళ్లు పూర్తయ్యాయి, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. నిర్ణీత సమయంలోగా నిర్మాణాలను పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సైతం అధికారులతో ఎప్పటికప్పుడు గృహ నిర్మాణాలపై సమీక్షిస్తున్నారు. గృహ నిర్మాణాలకు అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. జగనన్న కాలనీల్లో విద్యుత్, రోడ్లు, తాగునీరు, తదితర మౌలిక వసతుల కల్పనను పూర్తి చేశారు. దీంతో గృహ నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకొస్తున్నారు.



కట్టుబడిపాళెంలో నాణ్యతతో నిర్మిస్తున్న ఇళ్లు

సంతోషంగా ఉంది



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉచితంగా ఇళ్ల పట్టా ఇవ్వడంతో పాటు ఇంటిని నిర్మించి ఇవ్వడం సంతోషంగా ఉంది. ఆయన సాకారంతోనే సొంతింటి కల నెరవేరుతోంది. సొంతింటిని ఆస్తిగా భావించి నాణ్యతగా పనులు చేయించుకుంటున్నాం.

– నాగమ్మ, బుచ్చిరెడ్డిపాళెం

అద్దె ఇంటికి చెల్లు



సొంతిల్లు లేక అద్దె ఇంట్లో ఉంటున్నాం. జగనన్న కాలనీలో ఇంటి పట్టా ఇవ్వడంతో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వడంతో అద్దె ఇంటి బాధ తప్పింది. జగనన్న ప్రభుత్వంలో సొంతింటి కల సాకారం కావడంతో సంతోషంగా ఉంది.

–బుజ్జమ్మ, బుచ్చిరెడ్డిపాళెం

గృహ నిర్మాణాలపై నిత్యం పర్యవేక్షణ

గృహ నిర్మాణాలను నాణ్యతతో పాటు వేగవంతంగా నిర్మించేందుకు నిత్యం పనులను పర్యవేక్షిస్తున్నాం. ఇప్పటికే దాదాపు 461 ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలిన వాటిని నిర్ణీత సమయంలోగా పూర్తి చేసి త్వరలో గృహ ప్రవేశాలను చేపడుతాం. కాంట్రాక్టర్లు నిర్మించే ఇళ్ల విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం.

– గౌస్‌మోహిద్దీన్, ఏఈ, గృహనిర్మాణశాఖ

పారదర్శకంగా గడప గడపకు సంక్షేమ పథకాలు



ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెనుబల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రతి ఇంటిని సందర్శిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. కోవూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 54 సచివాలయాల పరిధిలో 61,760 ఇళ్లను సందర్శించామన్నారు. సంక్షేమ, అభివృద్ధి పాలన కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు.

30 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ

పెనుబల్లి సచివాలయంలో పంచాయతీ పరిధిలోని 30 మంది అర్హులకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే ప్రసన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు లేని వారి ఉచితంగా నివేశన స్థలాలు ఇవ్వడంతో పాటు రూ.1.80 లక్షలతో ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని తెలిపారు. ఎంపీడీఓ నరసింహారావు, తహసీల్దార్ పద్మజ, వైకేపీ ఏపీఎం లలిత, ఏఓ సురేంద్రరెడ్డి, నాయకులు జొన్నవాడ ప్రసాద్, గుమ్మా రఘురామయ్య, శ్రీకాంత్‌రెడ్డి, మురళి, వెంకయ్య, నరసింహారెడ్డి, జయరామిరెడ్డి, వైస్‌చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితా, కౌన్సిలర్లు, చీర్ల ప్రసాద్, షకీలా, అనంతమ్మ, బిట్రగుంట ప్రమీలమ్మ, మల్లారెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్



నార్తురాజుపాళెం సెంటినరి బాప్టిస్టు చర్చిలో ప్రసంగిస్తున్న దైవసందేశకులు



బుచ్చిరెడ్డిపాళెంలో క్రీస్తు గీతాల ఆలాపన

కొడవలూరు: మండలంలోని క్రైస్తవులు ఈస్టర్ పర్వదినాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. నార్తురాజుపాళెంలోని సెంటినరి బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిలకలూరిపేటకు చెందిన క్రీస్తు పరిచారకులు బ్రదర్ ప్రభుకిరణ్ చేసిన ప్రసంగం భక్తులను ఆకట్టుకుంది. మధ్యాహ్నం ప్రేమ విందు ఏర్పాటు చేశారు. చర్చి పాస్టర్ డాక్టర్ ఎం ప్రేమ్‌నాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చర్చి చైర్మన్, సెక్రటరీ బట్టేపాటి సుదర్శనం, కోవూరు సురేష్, ఎంపీపీ గాలి జ్యోతి, సర్పంచ్ బీ సుప్రియ, చర్చి సభ్యులు తుమ్మలపెంట అహరోన్, బొచ్చు శ్రీనివాసులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని క్రైస్తవులు ఈస్టర్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకొన్నారు. మండలంలోని క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు గీతాలను ఆలపించారు. దైవసందేశకులు ఈస్టర్ సందేశాన్ని అందజేశారు. యేసు క్రీస్తు శిలువ వేయబడిన మూడో రోజున మానవాళి కోసం తిరిగి లోకానికి వచ్చిన సందర్భంగా ఈస్టర్‌ను సంతోషంగా జరుపుకొంటామని తెలిపారు. సంఘ పెద్దలు, సంఘస్తులు పాల్గొన్నారు.

మహిమాన్విత క్షేత్రం..సంగమేశ్వర క్షేత్రం

- వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మనుబోలు: బద్దెవోలు రోడ్డు పక్కన కండలేరు ఒడ్డునున్న కామాక్షీతాయి సమేత సంగమేశ్వరాలయం మహిమాన్విత క్షేత్రంగా వెలుగొందుతోంది. పరశురాముడు తల్లిని సంహరించిన అనంతరం పాప ప్రక్షాళన కోసం దేశంలో ఎన్నో శైవక్షేత్రాలను నిర్మించాడు. అయినప్పటికీ పాప పరిహారం జరగకపోవడంతో ఆయన తండ్రి, గురువు అయిన జమదగ్ని మహర్షి ఆజ్ఞ మేరకు చివరగా మనుబోలు సమీపంలోని కండలేరు ఒడ్డున సంగమేశ్వరాలయాన్ని నిర్మించాడని పురాణాల కథనం. తూర్పు ముఖద్వారంతో కలిగిన ఈ ఆలయంలో అన్ని ఆలయాలకు భిన్నంగా వెలుపలకు వెళ్లే మార్గం దక్షిణం వైపుగా ఉంటుంది. ఆలయంలోకి వచ్చే, వెళ్లే మార్గాలు వేరుగా ఉండడంతో ఆలయాన్ని దర్శించుకునే వారి పాపాలు అక్కడే ఆగిపోతాయని భక్తుల నమ్మకం. సప్తముఖ శివలింగం ఇక్కడి ప్రత్యేకత.

తొమ్మిది రోజుల పాటు బ్రహ్మోత్సవాలు

సంగమేశ్వరస్వామి ఆలయంలో ఏటా ఏప్రిల్ 9 నుంచి 17వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. 9న ధ్వజారోహణం, 10న సప్రోత్సవం, 11న రావణ సేవ, 12న నందిసేవ, 13న రథోత్సవం, 14న కల్యాణోత్సవం, 15న పార్వేట, 16న వసంతోత్సవం నిర్వహించనున్నారు. 17న ఏకాంతసేవతో ఉత్సవాలు ముగియనున్నాయి.

రథోత్సవం ప్రత్యేకం

సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 13న అర్ధరాత్రి నిర్వహించే రథోత్సవం ఎంతో ప్రత్యేకత. సుమారు 30 అడుగుల ఎత్తున్న స్వామివారి రథాన్ని భక్తులు భుజాలపై మోసుకెళ్లడం ఇక్కడి ప్రత్యేకత. బ్రహ్మోత్సవాల్లో భాగంగా వధూవరులైన శివపార్వతుల విగ్రహాలను ఉంచిన రథాన్ని 13న రాత్రి మనుబోలులోని శివాలయం నుంచి 5 కి.మీ దూరంలో కండలేరు ఒడ్డున ఉన్న సంగమేశ్వరాలయానికి గ్రామస్తులు భుజాలపై మోసుకెళుతారు. 14న సంగమేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణం జరిపిస్తారు. రాత్రికి తిరిగి అదే రథంపై ఆది దంపతులను మనుబోలులోని శివాలయానికి మోసుకొస్తారు. రథోత్సవం, స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా ప్రజలు తరలివస్తారు.



సంగమేశ్వరాలయం



రథాన్ని మోస్తున్న భక్తులు(ఫైల్)

తాగునీరివ్వకుండా నిరాకరిస్తున్నారు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై సీహెచ్ వాసు

ఇందుకూరుపేట: తమ కుటుంబాలకు తాగునీరివ్వకుండా గ్రామస్తులు వెలివేస్తున్నారని గంగపట్నం మజరా టీవీకండ్రిగ గ్రామానికి చెందిన ఓసూరు మల్లికార్జున, సుధా, నక్కా సుబ్బయ్య, శీనయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వారు విలేకరులకు తమ గోడు వెల్లబోసుకున్నారు. ఇటీవల గ్రామంలో జరిగిన ఉత్సవాల సందర్భంగా చిన్నపాటి గొడవ నెలకొందన్నారు. అప్పట్నుంచి గ్రామస్తులు తమ నాలుగు కుటుంబాల వారికి మినరల్ వాటర్ ప్లాంట్ నుంచి తాగునీటిని నిరాకరిస్తున్నారని వాపోయారు. స్థానిక దుకాణాల్లో సైతం సరుకులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సమాచారం అందుకున్న ఎస్సై సీహెచ్ వాసు గ్రామానికి చేరుకుని ఆరాతీశారు. కుటుంబాలను వెలివేయడం అమానుషమన్నారు. చట్టానికి వ్యతిరేకంగా ఎవరైనా ప్రవరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై తెలిపారు.

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష



కోవూరు: కరపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



కొడవలూరులో..



మనుబోలు మండలం గోవిందరాజపురంలో..

వెంకటాచలం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే శ్రీరామరక్షగా నిలుస్తాయని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా కసుమూరులో సచివాలయ కన్వీనర్, గృహసారథులు, స్థానిక నాయకులు ఆదివారం ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గత ప్రభుత్వ , ప్రస్తుత ప్రభుత్వ పాలనలోని తేడాలను వివరించారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

ముత్తుకూరు: పేదల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైఎస్సార్‌సీపీ నాయకులు మారు సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పంటపాళెం పంచాయతీలోని ఊటల సంఘంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేయడమే కాకుండా పారదర్శకంగా గడప గడపకు చేరవేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న జగనన్నను రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. సచివాలయ కన్వీనర్లు నంగా చెంగారెడ్డి, తుంగా శ్రావణి, కత్తి ముత్యాలయ్య, ఆడిపూడి అరుణమ్మ, దాసరి అరుణమ్మ, కత్తి పోలయ్య, దిలీప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు : మండలంలోని మొగళ్లూరులో వైఎస్సార్‌సీపీ నాయకుడు యనమల శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ కన్వీనర్ ఆకుల గంగిరెడ్డి, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు.

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెం, గుండాలమ్మపాళెం, యల్లాయపాళెం, కొడవలూరు, కొత్తవంగల్లు, తదితర గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. గుండాలమ్మపాళెంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య పాల్గొని మాట్లాడారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు.

కోవూరు: మండలంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం కోవూరులో జెడ్పీటీసీ శ్రీలత, ఎంపీపీ పార్వతి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. గత ప్రభుత్వ పాలన, ప్రస్తుత ప్రభుత్వ పాలనలోని తేడాలను వివరించారు. రాబోయే ఎన్నికల్లో సంక్షేమ పాలన కోసం సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు.

- విడవలూరు మండలంలోని అన్ని గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీతో పాటు మండలంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్నారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్యనున్న వ్యత్యాసాన్ని వివరించారు.

మనుబోలు: మండలంలోని గోవిందరాజపురంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ కన్వీనర్, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. స్థానిక నాయకులు రమేష్, మమత, హరి, పోలయ్య, సుబ్బరాయుడు, ధనుంజయ సాయితేజ, బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు: మొగళ్లూరులో..



వెంకటాచలం: కసుమూరులో..



ముత్తుకూరు: పంటపాళెం పంచాయతీ ఊటల సంఘంలో..



విడవలూరు మండలం దంపూరులో..



బుచ్చిరెడ్డిపాళెంలోని 18వ వార్డులో..

కమ్యూనిస్ట్ నాయకుడు రామకృష్ణయ్యకు నివాళి



కోవూరు (విడవలూరు): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు, పౌర హక్కుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు పులి రామకృష్ణయ్య (86) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. విడవలూరు మండలం పార్లపల్లిలోని స్వగృహంలో ఆయన భౌతిక కాయానికి సీపీఐ (ఎం) జిల్లా కమిటీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, కార్యదర్శి వర్గసభ్యులు మోహన్‌రావు, దయాకర్, బడుగు సుబ్బయ్య, గోని దయాకర్ తదితరులు ఉన్నారు.

జ్యోతిష్య శిరోమణి మురళీకృష్ణకు సన్మానం

ముత్తుకూరు: పరమపూజ్య గురూజీ ఎన్వీ రాఘవాచారి 110వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో జాతీయ జ్యోతిష్య సదస్సును ఆదివారం నిర్వహించారు. జేకేఆర్ ఆస్ట్రో రీసెర్చ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎన్వీఆర్ఏ రాజా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జ్యోతిష్య శాస్త్రంలో చేస్తున్న సేవలకు గానూ దేశంలోని ప్రముఖ జ్యోతిష్యులను సన్మానించారు. అందులో భాగంగా ముత్తుకూరుకు చెందిన జ్యోతిష్య శిరోమణి మురళీకృష్ణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు జడ్జి వీ రామసుబ్రహ్మణియన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.